క్లుప్తంగా

బాల్యంలో ప్రేరణలే వ్యక్తిత్వ వికాసానికి మూలం



నెహ్రూనగర్: పిల్లల జీవితంలో మొదటి ఆరు సంవత్సరాలు అత్యంత విలువైనవని ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. గుంటూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సెక్టార్- 1 పరిధిలోని వెంకట్రావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం జన్‌భాగీదారీ కార్యక్రమాన్ని ప్రా రంభించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మా ట్లాడుతూ బాల్య దశలో కలిగే ప్రేరణలే మనిషి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయని చెప్పారు. చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం అందించడం ద్వారా మరింత ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తబిత, ప్రథమ్ జిల్లా కో ఆర్డినేటర్ స్వాతి, అంగన్‌వాడీ టీచర్ సల్మా, సిబ్బంది పాల్గొన్నారు.

పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



నెహ్రూనగర్: దేశ ప్రథమ సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాల్ని నగరంలో మున్సిపల్ ట్రావెలర్స్(హిందూ కాలేజీ సెంటర్) బంగ్లా ఎదురుగా ఏర్పాటు చేయాలని విగ్రహాల ఆవిష్కరణ కమిటీ కన్వీనర్ వై. కోటేశ్వరరావు(వైకే) డిమాండ్ చేశారు. ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైకే మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా పోరాటం చేస్తున్నప్పటికీ అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని ఖండించారు. ఇప్పటికైనా స్పందించి దంపతుల విగ్రహాల్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీకి జగన్‌ని విమర్శించే హక్కు లేదు

జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్

గుంటూరు రూరల్ : విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీకి, ఆ పార్టీ నాయకులకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే హక్కు లేదని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల నుంచి అభివృద్ధి జరగలేదంటూ ముఖ్యమంత్రి జగన్‌ని విమర్శిస్తూ తీవ్ర పదజాలంతో మాట్లాడారన్నారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పి, తర్వాత ఊసరవెల్లిలా మాటలు మార్చి చేతులెత్తేసిన ఘనత బీజేపీదని ప్రజలందరికీ తెలుసని ఆయన గుర్తు చేశారు. జగన్‌ని విమర్శించే ముందు బీజేపీ ప్రభుత్వం ఆంధ్రకు ఏమి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ప్రకటించి అప్పుడు జగనన్నని విమర్శించాలని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

చేబ్రోలు: ఆర్టీసీ బస్సు ఢీకొని మోపెడ్‌పై వెళుతున్న వృద్ధుడికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. వడ్లమూడి గరువుపాలేనికి చెందిన సూరగాని సుబ్బారావు మోపెడ్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో గుంటూరు నుంచి తెనాలి వెళ్తున్న ఆర్టీసీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో సుబ్బారావుకు తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్తిపాడు తహసీల్దార్‌గా సిద్ధార్థ



ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్‌గా జి. సిద్ధార్థ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎం. లీలాసంజీవకుమారి సాధారణ బదిలీల్లో భాగంగా నకరికల్లు మండలానికి వెళ్లిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో గుంటూరు కలెక్టరేట్‌లోని డీ అండ్ హెచ్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిద్ధార్థను ప్రత్తిపాడు తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్తామని తెలిపారు.

విద్య, విజ్ఞానమే విలువైన ఆస్తి

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్య, విజ్ఞానమే విలువైన ఆస్తిగా భావించి విద్యార్థులు విద్యావంతులుగా ఎదగాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-సాధు సుబ్రహ్మణ్యం జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన జగనన్న విద్యాకానుక స్టూడెంట్ కిట్ల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా కేటాయింపులు చేస్తోందని చెప్పారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్ని వేల కోట్ల రూపాయలతో ఆధునీకరించడంతో పాటు విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. పేదరికంతో పిల్లల చదువులు భారం కాకూడదని భావించి అమ్మఒడి ద్వారా రూ.15వేలు నేరుగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయిస్తున్నారని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చు, కృషిని గుర్తించి చక్కగా చదువుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరి ఫాతిమా, కళాశాల కమిటీ అధ్యక్షుడు సాధు శివశంకర్, కార్యదర్శి రామకృష్ణ ప్రభు, హైస్కూల్ హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, నూరి ఫాతిమా తదితరులు

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

పట్నంబజారు: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) చెప్పారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూలులో సోమవారం జగన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ పేద విద్యార్థులకు మేనమామలా సీఎం జగన్ అండగా నిలిచి ఎలాంటి ఖర్చులేకుండా విద్యనందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శారద, పాపయ్య, పాఠశాల హెచ్‌ఎం ఎం.శారదాదేవి, ఉపాధ్యాయులు శిరీష, సీతా మాధవి, శంకరరావు పాల్గొన్నారు.



మాజేటి గురవయ్య హైస్కూలులో కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఆచారి



8వ డివిజన్‌లో కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ ధనలక్ష్మి, పార్టీ నాయకురాలు నూరీ ఫాతిమా

విద్యకు అధిక ప్రాధాన్యత

నెహ్రూనగర్: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని 8వ డివిజన్ కార్పొరేటర్ యర్రి ధనలక్ష్మి, 55వ డివిజన్ కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్ తెలిపారు. జగనన్న విద్యా దీవెన కిట్లును ఆయా ఆయా డివిజన్లల్లో కార్పొరేటర్లు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు చదువుకోవడం ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చనే ఉద్దేశంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సీఎం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ తూర్పు మహిళ నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, పార్టీ నాయకులు పుల్లా కిశోర్, యర్రి సాయి, సుభాని, రమణయ్య, యోగయ్య, భానుప్రకాష్, కిరణ్, మీరావలి పాల్గొన్నారు.

విద్యతోనే రాణింపు

విద్య ద్వారానే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరానే సదుద్దేశంతోనే సీఎం వై.ఎస్. జగన్ జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తున్నారని డెప్యూటీ మేయర్ షేక్ సజీల తెలియజేశారు. పాత బస్టాండ్ వద్ద గల మొహమ్మదీస్ బాయ్స్ స్కూలులో సోమవారం జగనన్న విద్యా దీవెన కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మొయిన్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుకతో విద్యాభివృద్ధికి బాటలు

గుంటూరు ఎడ్యుకేషన్: జగనన్న విద్యాకానుకతో సమాజంలో విద్యాభివృద్ధికి బాటలు వేశారని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బడుగు విజయలక్ష్మి పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత విద్య అందించేందుకు పంపిణీ చేసిన జేవీకే కిట్లలో సామగ్రి నాణ్యతా ప్రమాణాలతో ఉన్నాయని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్ని అన్ని వసతులతో ఆధునీకరించిన సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేద కుటుంబాల పాలిట పెన్నిధిగా నిలిచారని తెలిపారు. పేరెంట్ కమిటీ చైర్మన్ షేక్ సుభాని, ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



55వ డివిజన్‌లో కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ అంబేడ్కర్



విద్యా కిట్లు అందజేస్తున్న డెప్యూటీ మేయర్ షేక్ సజీల



కిట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం విజయలక్ష్మి, కార్పొరేటర్ చిష్టీ

ఆకట్టుకున్న మాథ్స్ ఎగ్జిబిషన్



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన మాథ్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రేఖా గణితంలోని పలు ఆకృతుల్ని ప్రదర్శించారు. శంఖు నుంచి వివిధ ఆకృతులైన గోళం, ఎలిప్స్, పెరాబుల వంటి రేఖా గణిత ఆకృతుల విశేషాల్ని వివరించారు. ఉత్తమ ప్రదర్శనలకు కళాశాల కార్యదర్శి కర్నూరపు రామకృష్ణ ప్రభు బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, గణిత శాస్త్ర, కంప్యూటర్ విభాగాధిపతులు భవానీదుర్గ, ఏ. శ్రీధర్, అధ్యాపకులు చంద్రశేఖర్, మల్లీశ్వరి, శ్రీలక్ష్మి, రాజరాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మేధా సంపత్తి హక్కు, ఉపాధి అవకాశాలపై వెబినార్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్-రెగ్యులేటరీ అఫైర్స్, నాగపూర్‌లోని రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా సోమవారం మేధా సంపత్తి హక్కు, ఉపాధి అవకాశాలపై వెబినార్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎన్ఐఐపీఎంకు చెందిన అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ డాక్టర్ భరత్ ఎస్. సూర్యవంశీ వివిధ రకాల మేధో సంపత్తి హక్కులు, నమోదు చేసే పద్ధతులు, వివిధ రకాల పేటెంట్స్, డిజైన్స్ వాటి నిర్ణీత కాల పరిమితి, పేటెంట్ పొందిన వారి హక్కులు, ఉపాధి అవకాశాల్ని వివరించారు. ఆయా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కాటూరి మెడికల్ కాలేజీలో అరుదైన బ్రెయిన్ సర్జరీ

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితం

గుంటూరు మెడికల్: మెదడులో ట్యూమర్ ఏర్పడి ఆరు నెలలుగా తీవ్ర ఇబ్బంది పడుతున్న వ్యక్తికి కాటూరి మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా రూ. 10 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. గుంటూరు జిల్లా చినకొండ్రుపాడులోని కాటూరి మెడికల్ కాలేజీలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో అరుదైన శస్త్రచికిత్స వివరాలు న్యూరో సర్జన్ డాక్టర్ కాగిత రాకేష్ వెల్లడించారు. జిల్లాకు చెందిన 51 సంవత్సరాల వెంకట్రావు ఏడాది నుంచి తీవ్ర తలనొప్పి, ముఖ కండరాల నొప్పి, ఆరు నెలలుగా వినికిడి సమస్య, కుడి పక్క చూపు కూడా తగ్గి ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. చికిత్స కోసం తమ హాస్పిటల్‌కు రాగా వైద్య పరీక్షలు చేసి మెదడు సంకేతాలు పంపే ఐదో క్రేనియల్ నర్వ్ (ట్రైజెమినల్)లో కణితి (ట్యూమర్) పెరిగినందువల్ల సమస్య వస్తున్నట్లు గుర్తించామన్నారు. వైద్య పరిభాషలో ఈసమస్యను 'మల్టీ కంపార్ట్‌మెంటల్ ఇంట్రాడ్యూరల్ రైట్ ట్రైజెమినల్ ష్వానోమా' పిలుస్తారని తెలిపారు. ఇది అత్యంత అరుదైన ట్యూమర్ అని పేర్కొన్నారు. మైక్రోస్కోప్, ఎండోస్కోప్ పరికరాలతో ఈనెల 8న సుమారు 10 గంటలసేపు ఆపరేషన్ చేసి ట్యూమర్‌ను తొలగించామని వివరించారు. ఆపరేషన్ అనంతరం తీవ్ర తలనొప్పి పూర్తిగా తగ్గి, వినికిడి, ముఖ కండరాలు యథాస్థితికి వచ్చాయని తెలిపారు. ముఖ పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్, ప్రాణాపాయం నుంచి రోగిని కాపాడామని చెప్పారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటు డాక్టర్ హేమంత్, మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎల్.నాగేశ్వరరావు పాల్గొన్నట్లు వెల్లడించారు. బ్రెయిన్ హెమరేజ్, మెదడులో కణితులు (బ్రెయిన్ ట్యూమర్) మెడనొప్పి, సర్వైకల్ స్పాండిలోసిస్ వెన్ను సమస్యలు, తలనొప్పి, కార్పల్ టన్నెల్ సింగ్రోమ్ తదితర జబ్బులు ముదరక ముందే వైద్యం పొందితే అంగవైకల్యం నుంచి పూర్తి ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని ఆయన తెలిపారు.



సర్జరీ చేయించుకున్న వెంకట్రావుతో డాక్టర్ కాగిత రాకేష్, వైద్య బృందం

ఫిర్యాదుల్ని విభాగాధిపతులే పరిష్కరించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదుల్ని విభాగాధిపతులే నేరుగా పరిశీలించాలని, ఏ ఒక్కటీ పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన నిర్వహించారు. కమిషనర్ తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈఆర్పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులు, సంబంధిత సిబ్బందితో సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి 'జగనన్నకు చెబుదాం'కు అందే ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా రాష్ట్రస్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్న దృష్ట్యా, ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని చెప్పారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్స్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీలకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజల నుంచి 38 ఫిర్యాదులు

సోమవారం నిర్వహించిన స్పందనలో 38 ఫిర్యాదులు అందాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి- 12, ఇంజినీరింగ్ విభాగానికి- 15, రెవెన్యూ విభాగానికి -1, ప్రజారోగ్య విభాగానికి- 4, ఉపా సెల్ విభాగానికి- 2, అకౌంట్స్ విభాగానికి- 1, ఎడ్యుకేషన్ విభాగానికి- 3 ఫిర్యాదులు ఉన్నాయి. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఉపా సెల్ పీవో రవీంద్ర, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ భానుప్రకాష్, ఏడీహెచ్ రామారావు, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ సిటీప్లానర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

యోగాతో అనారోగ్య సమస్యలకు పరిష్కారం



యోగా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ
- యోగా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కొరిటెపాడు(గుంటూరు): నేటి ఆధునిక జీవన శైలి, పని ఒత్తిడి వలన తలెత్తే అనేక అనారోగ్యాలకు యోగా చక్కటి పరిష్కారం చూపుతుందని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న యోగా వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ బహుముఖ విష వలయమైన పేదరికాన్ని జయించేందుకు, పేదల జీవన ప్రమాణ స్థాయి పెంపునకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. వేల సంవత్సరాల భారతీయ మూలాల నుంచి యోగా విద్య మనకు అందుబాటులో ఉందని, క్రమశిక్షణతో కూడిన యోగ అభ్యాసం-ఆరోగ్య ప్రదాయిని అవుతుందన్నారు. సమాజంలో యోగా పట్ల ఆసక్తి, అవగాహనను పెంపొందిస్తూ యోగాభ్యాసంలో మెలకువలను నేర్పే సత్సంకల్పంతో బజరంగ్ యోగా వారోత్సవాలను చేపట్టిందని స్పష్టం చేశారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను ప్రోత్సహించేందుకు యోగా అమృతాహారాన్ని ఈ వారోత్సవాల్లో భాగంగా అందజేస్తామని తెలిపారు. జీవన శైలి వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించి, సంబంధిత సహాయాన్ని అందించడం జరుగుతుందని వెల్లడించారు. గురు పరంపరలో ఉన్న ప్రఖ్యాత యోగ గురువులను స్మరించుకోవడం ద్వారా వారి నుంచి స్ఫూర్తిని పొందగలుగుతామని, అందుకే ప్రతిరోజు ఒక గురువును పూజించుకోవడం జరుగుతుందన్నారు. ఈ నెల 15వ తేదీన ఆచార్య పతంజలి గురు పూజ, 16న ఆచార్య తిరుమలై కృష్ణమాచార్య గురు పూజ, 17న ఆచార్య కృష్ణ పట్టాభి గురు పూజ, 18న ఆచార్య బి.కె.ఎస్.అయ్యంగార్ గురు పూజ, 19న ఆచార్య వి.నానమ్మాల్ గురు పూజ, 20న ఆచార్య శివానంద గురు పూజ, 21వ తేదీన ఆచార్య సద్గురు జగ్గీవాసుదేవ్ గురు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి గల వారు 9154428858, 9063063943 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: మహిళ హత్య కేసులో నిందితుడ్ని లాలాపేట పోలీసులు అరెస్టు చేశారు. నల్లచెరువు మూడో లైనులో నివసించే భారతీబాయి ఈనెల 9న హత్యకు గురైన సంగతి తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు భారతీబాయితో సహజీవనం చేసిన కేవీపీ కాలనీకి చెందిన మెట్టు ప్రతాపరెడ్డి నిందితుడిగా గుర్తించారు. అతడ్ని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

తరలించారు.

బాలిక అదృశ్యం

బాలిక అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. గుండారావుపేటలో నివసించే ఓ కుటుంబానికి చెందిన 17 సంవత్సరాల బాలిక ఆదివారం ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

మహిళను బెదిరించిన వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శివరామనగర్‌లో నివసించే అమర్తలూరి గీతిక, భర్త వెంకటేశ్వరరావు వేధింపులపై గతంలో నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. దాన్ని వెనక్కి తీసుకోవాలని ఆమెను వెంకటేశ్వరరావు అనుచరుడు అయిన ఇరుకు దేవిడ్‌రాజు బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ మండపంలో బంగారు నగల చోరీ

కల్యాణ మండపంలో బంగారు నగలు చోరీకి గురైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. చిలకలూరిపేట మండలం పురుషోత్తమపట్నానికి చెందిన దేవిరెడ్డి లక్ష్మీసౌజన్య కొరిటెపాడులోని బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి హాజరైంది. ఈనెల 11న ప్రియా గార్డెన్స్‌లో వివాహం జరుగుతున్న సమయంలో ఆమె బంగారు నగలు ఉన్న బ్యాగును పెళ్లి కుమారుడు విడిది గదిలో పెట్టి బయటకు వచ్చింది. తిరిగి వెళ్లి చూసేసరికి రూ. 3 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ మేరకు లక్ష్మీ సౌజన్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

మహిళ ఆత్మహత్యపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డితోటకు చెందిన షేక్ మహబూబ్ సుభాని భార్య షేక్ మహబూబి (32) భర్త ఇంట్లో లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండు రోజుల అనంతరం ఇంటికి వచ్చిన సుభాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. మహబూబి ఆత్మహత్యకు కారణాలు ప్రాథమికంగా తెలియరాలేదని, దర్యాప్తులో తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

నిద్రమాత్రలు మింగి వ్యక్తి..

నిద్రమాత్రలు మింగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శారదా కాలనీలో నివసించే గురజాల శ్రీను (55) పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈనెల 17న పెద్ద మొత్తంలో నిద్రమాత్రలు మింగాడు. కుటుంబ సభ్యులు అతడ్ని జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం శ్రీను మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ పునఃప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న దయాసాగర్

కొల్లిమర్ల(కాకుమాను): మండలంలోని పాత కొల్లిమర్లలో గల అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ఉత్సవమూర్తుల విగ్రహ పునఃప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ, గ్రామస్తుల సహకారాలతో పురాతన ఆలయాన్ని పునరుద్ధరించారు. అందులో ఉత్సవమూర్తుల విగ్రహ పునఃప్రతిష్ఠను దేవాలయ చైర్మన్ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కన్నుల పండువలా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ పాల్గొన్నారు. విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా దేవస్థాన ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, సర్పంచ్ విప్పడపు రాంబాబు, గద్దం కోటేశ్వరరావు, వీరాస్వామి పాల్గొన్నారు.